క్లుప్తంగా

రూరల్ సీఐ ప్రేమయ్య బాధ్యతలు స్వీకరణ



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.ప్రేమయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా పీసీఆర్ సీఐగా పని చేస్తున్న ప్రేమయ్య బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన చిట్టెం కోటేశ్వరరావును గుంటూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ ప్రేమయ్య జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి భూ పరిశీలన



పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించనున్న కల్యాణ మండపానికి స్థలాన్ని డీఈఈ నాగభూషణం, ఏఈ జగన్మోహన్ సోమవారం పరిశీలించారు. దాత రూ.40లక్షలు, టీటీడీ నిధులు రూ.1.60కోట్లతో కల్యాణ మండపం నిర్మించనున్నారు.

జ్ఞానసరస్వతిని తాకిన సూర్య కిరణాలు



సత్తెనపల్లి: పట్టణంలోని త్రి శక్తి దుర్గాపీఠంలో జ్ఞానసరస్వతి అమ్మవారిని సోమవారం సూర్యాస్తమయంలో కిరణాలు తాకాయి. శ్రావణ మాసంలో సూర్యాస్తమయ కిరణాలు తాకడం విశేషమని పీఠాధిపతి వెలిదండ్ల హనుమంతరావు తెలిపారు.

లార్వా పెరగకుండా చర్యలు చేపట్టాలి



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మురుగుకాల్వల్లో లార్వా పెరగకుండా కాల్వల్లో దోమల నివారణ మందు చల్లాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామాన్ని సోమవారం సందర్శించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జ్వరాలు వస్తే వెంటనే రక్తపరీక్షలు చేసుకొని వ్యాధి నిర్ధారణ చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలన్నారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని రక్తపరీక్ష గదిని పరిశీలించారు. జ్వరం వచ్చిన వారికి వెంటనే రక్తపరీక్ష చేయాలని ల్యాబ్‌టెక్నీషియన్‌కు సూచించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మలేరియా సబ్‌యూనిట్ అధికారి సీహెచ్ ప్రభాకరరెడ్డి, సీహెచ్‌ఓ పి.ఆంజనేయులు, సూపర్‌వైజర్లు ఎ.పీటర్‌డేమియన్, నాగమల్లేశ్వరరావు, భరత్, కార్యదర్శి పార్వతి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

సత్తెనపల్లి: ఓటర్ల జాబితాలపై నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఈనెల 29న ఉదయం 11:30 గంటలకు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దార్ ఎస్.సురేష్ సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి అధ్యక్షత వహిస్తారన్నారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

ఎస్సీ రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు

నరసరావుపేట రూరల్: ఎస్సీ రైతులకు సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు, చిన్న ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు అందిస్తున్నట్టు ఉద్యానశాఖ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని యల్లమంద రైతు భరోసా కేంద్రంలో మిరప, ఉద్యాన పంటలపై సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాలు అవసరమైన రైతులు ఉద్యాన శాఖ అసిస్టెంట్ లేదా గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించాలని సూచించారు. నీటి వసతి లేని ప్రాంతాల్లో బోరు, గొట్టపు బావుల ద్వారా రైతులు మిరప పంటను సాగు చేసుకోవాలని ఆయన సూచించారు. సాగులో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు సాయినాథ్, ఎంపీఈఓ షేక్ మస్తాన్‌వలి, ఫీల్డ్ అసిస్టెంట్ కాశీ రామారావు, రైతులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వ్యాధులకు చెక్

- వాతావరణ మార్పులు, అపరిశుభ్రతతో రోగాలు వ్యాపించే అవకాశం
- ముమ్మరంగా సాగుతున్న ఫీవర్ సర్వే
- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలంటున్న వైద్యాధికారులు
- గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన



గర్నెపూడిలో ఫీవర్ సర్వే చేస్తున్న ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది

సత్తెనపల్లి: తాగునీటి పైపులు కలుషితం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, మురుగుకుంటల్లో దోమలు వృద్ధి చెందడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయి. ఇప్పటికే జ్వరాలతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ సీజన్‌లో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామెర్లు, చికున్‌గున్యా వంటి వ్యాధుల ఉధృతి పెరిగే అవకాశాలు ఎక్కువ. ఆయా గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటి వద్దకు వైద్యసిబ్బంది వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు. ప్రజలు ఇళ్లలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ, ప్రతి శుక్రవారం డ్రైడేను గ్రామాల్లోని పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది నిర్వహించి గ్రామాల పరిశుభ్రతకు పాటుపడుతున్నారు. గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో పంచాయతీ అధికారులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తూ, మండల స్థాయి అధికారులకు తెలియజేస్తూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. వర్షాకాలం కావడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అవగాహన కల్పించడంతో పాటు రోగాల బాధపడుతున్న వారి రక్తనమూనాలను సేకరిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.

నివారణ చర్యలు ...

సాలమనెల్లా టైఫీ బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తిచెందే టైఫాయిడ్‌తో పాటు డయేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణంతకమని వైద్యులు చెబుతున్నారు. బ్యాక్టీరియా ద్వారా కాలుష్యానికి గురయ్యే నీటిని సేవించడం వల్ల ఈ వ్యాధులు సంక్రమిస్తాయి. వీటి నివారణ కోసం ప్రభుత్వం ప్రతిష్టమైన చర్యలు చేపడుతుంది. మలేరియా నివారణ కోసం చేపడుతున్న ఫ్రైడే డ్రై డేలు బహుళ ప్రయోజనాలు ఇస్తున్నాయి. మంచినీటి నిల్వలో పెరిగే బ్యాక్టీరియా నివారణకు క్షేత్రస్థాయిలో సిబ్బంది పనిచేస్తున్నారు. గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉన్నచోట పరిశీలించి క్లోరినేషన్ చేయిస్తున్నారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు ...

- ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీరు, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి
- మల, మూత్ర విసర్జన అనంతరం చేతులు శుభ్రపరుచుకోవాలి
- ఇంటి పరిసరాల్లో టైర్లు , డ్రమ్ములు ఉంచకూడదు
- దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలి
- పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలి
- చిన్న పిల్లలకు ఒంటిని పూర్తి కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి. ఇళ్లలో దోమతెరలు, కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి
- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- ఇంటి ముందు చెత్తను వేయరాదు
- ఇంటి పరిసరాల్లో కొబ్బరిబొండాలు, మురుగునీటి ప్రాంతాలే జ్వరానికి కారణం

జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి



వర్షాకాలం ప్రారంభ మైన నేపథ్యంలో జ్వరాలు అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండు రోజుల కంటే జ్వరం తగ్గకుంటే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలి. అవసరమైన మందులు, రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. సాధ్యమైనంత వరకు నీళ్లు కాచి చల్లార్చి తాగాలి. అన్ని గ్రామాల్లోని వైద్య సిబ్బందితో పాటు వలంటీర్లు ఫీవర్ సర్వేను నిర్వహిస్తున్నారు.

–డాక్టర్ యు.శ్రీలక్ష్మి కవిత, వైద్యాధికారిణి, పీహెచ్‌సీ, ఫణిదం

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన



చాగంటివారిపాలెంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు యూనిఫాం అందిస్తున్న ఎంపీపీ పద్మ



నకరికల్లులో యూనిఫాం అందజేస్తున్న భవనం రాఘవరెడ్డి, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి

నకరికల్లు: సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా ప్రభుత్వపాలన సాగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేచారపు అనురాధ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించిందని అన్నారు. ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి శాఖలవారీగా సమీక్ష చేశారు. ఆయాశాఖల తరపున చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు యూనిఫాం, కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ బాషా, జడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, ఈఓపీఆర్డీ గిరిధర్, ఏఓ కె.దేవదాసు, ఆయాశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ముప్పాళ్ళ: అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీపీ మారూరి పద్మ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం రైతు భరోసా కేంద్రంలోని సమావేశ మందిరంలో సోమవారం మండలస్థాయి అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మారూరి పద్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు–నేడు ద్వారా అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా వేతనాలు అందిస్తున్నామన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా మండలంలోని మొత్తం 45 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండు జతల యూనిఫామ్‌ను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బరువులు తీసేందుకు అవసరమైన వెయింగ్ మిషన్‌లను అందించారు. తహసీల్దార్ ఎం.భవానీశంకర్, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత, ఏసీడీపీఓ సంతోషికుమారి, సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధి నిర్వహణలో తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల చెప్పారు. పట్టణంలోని 24వ వార్డులో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు యూనిఫామ్ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో వ్యయ ప్రయాసలతో నాణ్యమైన యూనిఫారం సరఫరా చేస్తుందన్నారు. కార్యకర్తలు, ఆయాలు తప్పనిసరిగా విధి నిర్వహణలో యూనిఫారం ధరించాలన్నారు. ఈ సందర్భంగా 21 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు, 21 మంది ఆయాలకు యూనిఫారం రాగా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అస్రాఫ్ అలీ చేతులమీదుగా పంపిణీ చేశారు. సెక్టార్ లీడర్లు ఇ.అంజనా, డి.సువార్త, అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల అత్యుత్సాహం

అచ్చంపేట: ప్రభుత్వ నిబంధనలకు లోబడి, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు జరుగుతున్న ఇసుక రవాణాను అడ్డుకునేందుకు కొత్తపల్లి డంపింగ్ పాయింట్ వద్ద సోమవారం టీడీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. సత్యాగ్రహ దీక్షల పేరుతో అడ్డుకునే ప్రయ త్నం చేశారు. ఇసుక రవాణా ఆపేయాలంటూ నినాదాలు చేశారు. నిబంధనలకు లోబడే రవాణా చేస్తున్నామని, ఎందుకు ఆపాలంటూ ని ర్వాహకులు ప్రశ్నించడంతో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. అచ్చంపేట ఎస్‌ఐ సీహెచ్ మణికృష్ణ ఘటనస్థలానికి చేరుకుని సజావుగా జరుగుతున్న రవాణాను అడ్డుకునే హక్కు ఎవ్వరికి లేదని, స్వచ్ఛందంగా ఖాళీ చేసి వెళ్లాలని చెప్పినా వినకపోవడంతో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం మరికొంతమందిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తులు ఆహ్వానం

అచ్చంపేట: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యలో భాగంగా ఓపెన్ ఇంటర్ మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.పద్మ సోమవారం విలేకరులకు తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణులై వివిధ కారణాలవల్ల ఇంటర్ రెగ్యులర్‌గా చదవలేని విద్యార్థులకు ఓపెన్ ఇంటర్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఇంటర్ మానేసినవారు, టెన్త్ పాసైనవారు అర్హులన్నారు. ఈనెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి సమాచారం కొరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంప్రదించవలసినదిగా ఆమె కోరారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

అచ్చంపేట: పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావులు మండలంలో మంగళవారం పర్యటిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు సోమవారం తెలిపాయి. మధ్యాహ్నం రెండు గంటలకు నిండుజర్లలో రూ.15లక్షల ఎంపీ ఫండ్స్‌తో మంజూరైన బీసీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనవలసినదిగా ఆయన కోరారు.

దొడ్లేరులో...

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాలను మంగళవారం నరసారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరుశంకరరావులచే శంకుస్థాపన కార్యక్రమాలు జరుగుతాయని ఎమ్మెల్యే కార్యలయవర్గాలు సోమవారం తెలిపాయి. అదేవిధంగా మండలంలోని అనంతవరంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలన్నారు.

మిరప సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

సత్తెనపల్లి: మిరప సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారిణి సీహెచ్ జనని చెప్పారు. మిరప పంటలో ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సత్తెనపల్లి మండలం అబ్బూరు, ఫణిదం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జననీ మాట్లాడుతూ అలసంద, పిల్లి పెసర లాంటి పచ్చిరొట్ట పైర్లను వేసి ఉంటే రోటవేటర్‌తో నేలను కలియదున్నాలన్నారు. రసాయన ఎరువులు మీద ఆధారపడకుండా అందించాల్సిన మొత్తం పోషకాలలో 25 శాతం సేంద్రియ ఎరువు రూపంలో వేయాలన్నారు. ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు, 200 కిలోల వేపపిండి వేయాలన్నారు. జీవన ఎరువులు అయిన అజోస్పైరిల్లమ్, ఫాస్ఫో బ్యాక్టీరియా, వ్యామ్, పొటాష్ బ్యాక్టీరియా, జీవన శిలీంధ్రాలైన ట్రైకోడెర్మా, సూడోమోనాసులను పశువుల ఎరువులతో వాడటం వలన నేల ద్వారా సంక్రమించే ఎండు తెగులు, వేరు కుళ్లు తెగులు వంటివి నివారించవచ్చునన్నారు. వ్యామ్ వాడటం వలన నీటి ఎద్దడిని తట్టుకోవడమే కాకుండా వేరు వ్యవస్థను పటిష్ట పరుస్తూ భూమిలో ఉన్న పోషకాలను మొక్కకు అందిస్తుందన్నారు. నాటేటప్పుడు దుక్కిలో యూరియా 65 కేజీలు, సూపర్ ఫాస్ఫేట్ 150 కేజీలు, పొటాష్ 20 కేజీలు, ఎకరానికి మిరప పంటలో వేయాలన్నారు. జింకు లోపం ఉండే భూముల్లో ఎకరాకు 10 కిలోలు చొప్పున జింక్ సల్ఫేట్ దుక్కిలో వేయాలని, నాటిన 30 – 45 రోజుల మధ్య లీటర్ నీటికి ఐదు గ్రాములు చొప్పున జింక్ సల్ఫేట్ కల్పిన ద్రావణాన్ని పైరు పై పిచికారీ చేయాలన్నారు. ఇనుపధాతులోప నివారణకు లీటర్ నీటికి ఐదు గ్రాములు చొప్పున అన్నబేది, రెండు గ్రాములు నిమ్మ ఉప్పు చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. గ్రామ ఉద్యాన సహాయకులు బి.వెంకటేశ్వరరావు, బీడీవీ పవన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

మారథాన్ పోటీలకు స్పందన



మారథాన్ పోటీల్లో పాల్గొన్న అధికారులు, బాలబాలికలు

వినుకొండ టౌన్: ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నిరోధక సంస్థ, స్థానిక శ్రీమతి గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఐదు కిలోమీటర్ల జిల్లాస్థాయి మారథాన్ పోటీలు సోమవారం పట్టణంలోని శివయ్య స్తూపం సెంటర్ నుంచి ప్రారంభమయ్యాయి. పలు జూనియర్, డిగ్రీ కళాశాలల నుంచి 64మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ పి. పద్మావతి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. కె. శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. పోటీలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన పది మంది బాలబాలికల్ని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి. శివ ఫణీంద్ర, ఆర్ఆర్‌సీ కో–ఆర్డినేటర్ కిశోర్ బెహరా, అధ్యాపక సిబ్బంది ఎల్. మధుసూదనరావు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ ఏపీఎస్ఏసీఎస్ కె. సురేష్, ఐసీడీసీ మేనేజర్, ఎన్జీవోలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి దాతల విరాళం



రూ.51,001 విరాళం అందిస్తున్న దృశ్యం

పెదకూరపాడు: పంచారామంలోని ప్రాశస్త్యం గావించిన ప్రథమ పంచారామమైన బాల చాముండికా సమేత శ్రీ అమరేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిత్య అన్నదానానికి దండూరి ధృవ్ రూ.51,001, గరిమెళ్ల కృష్ణ, వెంకట మహాలక్ష్మి దంపతులు రూ.5,558, మరికొంత మంది భక్తులు రూ.5,073 విరాళం అందించినట్లు దేవాలయం కార్యనిర్వహణాధికారి వేమురి గోపి సోమవారం తెలిపారు. ప్రతి రోజు దేవాలయంలో నిత్య అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వేదపండితులు పాల్గొన్నారు.

పాడిపరిశ్రమతో ఆర్థికాభివృద్ధి

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

నకరికల్లు: పాడి పరిశ్రమతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవొచ్చని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలో రైతు కావేటి రామారావుకు చెందిన పాడి పరిశ్రమను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి అనుగుణంగా పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకోవడం మరింత ఆదాయం తెచ్చిపెడుతుందని అన్నారు. నిత్యం ఆదాయం ఇచ్చే డైరీ ఫాంపై రైతులు దృష్టిసారించాలని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు దేవరశెట్టి శ్రీనివాసరావు అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటుండడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూనే ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, జడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, రాజుపాలెం మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



చీమలమర్రిలో డైరీఫాంను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

పాలవెల్లువ లబ్ధిదారులందరికీ రుణాలు



రుణమేళాలో మాట్లాడుతున్న జీడీసీసీ బ్యాంకు మేనేజర్ షేక్ రఫీ

క్రోసూరు: జగనన్న పాలవెల్లువకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు తమ బ్యాంకు నుంచి తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తామని జీడీసీసీ బ్యాంకు మేనేజరు షేక్ రఫీ తెలిపారు. సోమవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యక్రమంలో జగనన్న పాలవెల్లువ లోన్‌మేళా జరిగింది. కార్యక్రమానికి ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజరు రఫీ మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా అమూల్ పాలకేంద్రాలకు పాలుపోసే పాడి రైతులందరికీ రూ.1లక్ష నుంచి రూ.1.60 లక్షల మేర పాడిపశువులు కొనుగోలు చేసుకునేందుకు రుణాలు అందిస్తున్నామని అన్నారు. కేవలం 0.70 పైసల వడ్డీకి ఏడాదికి ఋణాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. మేళాకు హాజరైన ఆరు గ్రామాల నుంచి 250 మంది దరఖాస్తులు అందించారని, వారి దరఖాస్తులు పరిశీలించి రుణాలు అందిస్తామన్నారు. అదేవిధంగా మండలంలోని మిగతా 12 పంచాయతీలలోని చేయూత, జేపీవీ లబ్ధిదారులకు మంగళవారం జరిగే మేళా ద్వారా దరఖాస్తులు తీసుకుని రుణాలు అందించటం జరుగుతుందన్నారు. వచ్చే నెల 15 కల్లా పాడిగేదెలు కొనుగోలు(రుణాలతో) గ్రౌడింగ్ పూర్తి చేయటం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఊటుకూరు, అందుకూరు, క్రోసూరు, ఎర్రబాలెం, పీసపాడు, అనంతవరం గ్రామాల చేయూత లబ్ధిదారులు, జగనన్న పాలవెల్లువ లబ్ధిదారులు పాల్గొన్నారు. ఎంపీడీఓ బి.మహేష్‌బాబు, విస్తరణాధికారి పి.శివరామయ్య, ఏపీఎం షేక్ సలీం, మండల పశువైద్యులు డాక్టర్ సీహెచ్ మల్లయ్య, పశుసంవర్ధకశాఖ సహాయకురాలు ఎ.మణి, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలకు ఫర్నీచర్ వితరణ



పట్టణంలోని ఏరియా వైద్యశాలకు ఫర్నీచర్ అందిస్తున్న కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలకు రూ.25 వేలు విలువ చేసే ఫర్నీచర్‌ను వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం అందించారు. వైద్యశాలలో గర్భిణులకు అవసరమైన పరీక్షలు చేసేందుకు, జనరల్ సర్జరీ పరీక్షలకు కావాలసిన టేబుల్ అసౌకర్యంగా ఉండటంతో కొత్త రామకృష్ణ తన మిత్రులు చందూ నరసింహారావు సహకారంతో ఏరియా వైద్యశాలకు అవసరమైన ఫర్నీచర్‌ను అందించారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ గర్భిణులకు పరీక్షలు చేసే టేబుల్ స్టాండ్ అందించామన్నారు. తాము అడగ్గానే స్పందించి ఒక ఎగ్జామినేషన్ టేబుల్ అందించిన చందు నర్సింహా రావు (వీఆర్వో రాజుపాలెం) వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా జనరల్ సర్జరీ వారికి ఎగ్జామినేషన్ చేయటానికి టేబుల్ అవసరం కాగా వారికి కూడా అందజేశామన్నారు. వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అవసరమైన మౌలిక వసతులు అందించడంలో కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఎప్పుడు ముందుంటారని కొనియాడారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ ఉన్నారు.

భాషా పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



భాషా దినోత్సవంలో పాల్గొన్న బాల సాహితీవేత్త డాక్టర్ బెల్లంకొండ నాగేశ్వరరావు

యడ్లపాడు: భాషా పరిరక్షణ బాధ్యతని చెన్నైకు చెందిన బాలసాహితీవేత్త డాక్టర్ బెల్లంకొండ నాగేశ్వరరావు చెప్పారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక నారాయణ స్కూలు ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాడుక భాష పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి జయంతి సందర్భంగా ఏటా ఆగస్టు 29న భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు వెల్లడించారు. తెలుగు భాషా ఆవశ్యకత, పూర్వం –ప్రస్తుతం మాతృభాష పరిస్థితుల్ని ఆయన వివరించారు. తెలుగు భాషా పరిరక్షణకు గిడుగు చేసిన కృషిని కొనియాడారు. తెలుగు సాహిత్యంలో మన కవులు, రచయితలు ఎన్నో విలువైన రచనలు చేశారని వాటిని ప్రతి విద్యార్థి చదివి, తెలుగు భాషా గొప్పదనం గురించి తెలుసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా పఠనాశక్తిని అలవర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, స్కూలు ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.6లక్షల విరాళం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణ అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి బెంగళూరుకు చెందిన ప్రముఖ వ్యాపారస్తులు పిట్టమూడుసు లింగరాజు రూ.6,11,116ను సంఘం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు పెండేల వెంకట పుల్లారావు, ప్రెసిడెంట్ పులిపాటి రామారావు, సెక్రటరీ జాజుల మాల్యాద్రి, వైస్ ప్రెసిడెంట్ చందోలు మల్లికార్జునరా వు, అచ్యుత కృష్ణ, గంధం బాలిరెడ్డి, జాగర్లమూడి సుబ్బారావు, గజవల్లి పవన్, దండు చె న్నయ్య, కన్నెగండ్ల అనంత రామకోటేశ్వరరా వు, గోవింద నాయక్, రెడ్డి నగేష్, తేలికపల్లి బాబు, ములకా రామతులసీరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.